564) శంకరాభరణం

ప॥ అలివేణిని బెండ్లాడవయా । చెలుల విన్నపము చేకొనవయ్యా ॥

చ॥ సొలపుల దొలి తొలి చూపులు । కొలదిమీర నుంకువలాయ ।
చెలగి చేతులను సేసిన సన్నలు । తలపగ నలుగడ దలబాలాయ ॥

చ॥ ననుపున సెలవుల నవ్విన నవ్వులు । గొనకొనగ బాలకూళ్ళాయ ।
అనువుగ ప్రియమున నాడిన మాటలు । మనసిజ తంత్రపు మంత్రములాయ ॥

చ॥ వేడుక కౌగిట వినయపు సేతలు । కూడిన కూటపు గురులాయ ।
యీడనె శ్రీవేంకటేశ యేలితివి । తోడలమేల్మంగ దోమట్లాయ ॥